సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 31 । జనవరి । 2025



పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ చాంప్ విశాఖ 8లో



చెరువు గర్భం పూడ్చివేయడంపై రైతుల ఆందోళన 8లో



మహాత్ముని జీవితం ఆదర్శం 8లో

న్యూస్‌రీల్

పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ సస్పెన్షన్



సస్పెన్షన్‌కు గురైన శ్యామ్‌సుందర్

పరవాడ: మద్యం సేవించి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన పరవాడ ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్‌ను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి గురువారం సాయంత్రం చేరాయి. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో శ్యామ్ సుందర్ పూటుగా మద్యం సేవించి, హాజరైనట్లు నిర్ధారణ కావడంతో జిల్లా కలెక్టర్ ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన చోడవరం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే సస్పెన్షన్‌కు గురవడం గమనార్హం.

డిప్యూటీ తహసీల్దార్‌కు జైలు



డీటీ హనుమాన్ వినయ్‌కుమార్

విశాఖలీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన అనకాపల్లి జిల్లా యలమంచిలి డిప్యూటీ తహసీల్దార్ తురుమళ్ల హనుమాన్ వినయ్ కుమార్‌కి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ నగరంలోని రెండో అదనపు ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.9.05 లక్షలు జరిమానా విధించారు. ఇందులో రూ.9 లక్షలు బాధితురాలికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. బాధితురాలు పద్మావతి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వినయ్ కుమార్ 2019 నవంబర్ 14వ తేదీన పద్మావతి దగ్గర రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చే నిమిత్తం 2022 మార్చి 2వ తేదీన వినయ్‌కుమార్ ఒక చెక్కు ఇచ్చారు. పద్మావతి ఆ చెక్కును తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా తగినన్ని నిధులు లేని కారణంగా చెక్కు నిరాదరణకు గురైంది. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు తగిన శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ న్యాయమూర్తులను కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని గ్రంథాలయంలో గురువారం విశాఖ న్యాయవాదుల సంఘం, న్యాయసేవ ప్రాధికార సంస్థ సంయుక్తంగా మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ కేసుల విచారణకు ముందు ఇరువర్గాలు మధ్యవర్తిత్వ కేంద్రంలో తమ వాదనలు వినిపించాలని కోరారు. మీడియేషన్ అండ్ కన్సిలేషన్ జాతీయ శిక్షకురాలు రత్నతార మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రంలో కేసులను ప్రాథమిక దశలోనే ఇరువర్గాలు తమ వాదనలు వినిపిస్తే కేసులు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. మరో జాతీయ శిక్షకురాలు సత్యారావు మాట్లాడుతూ కేసుల విచారణలో ప్రాథమిక దశ చాలా కీలకమైందన్నారు.

అనుమతుల్లేని భవనాల్లో కాలేజీలు నిర్వహించవద్దు

ఆర్ఐవో మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతి పొందిన భవనాల్లోనే కళాశాలలను నిర్వహించాలని ఆర్ఐవో పి.మురళీధర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలో ఒక చోట అనుమతి తీసుకుని.. మరో చోట కాలేజీలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయి తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తింపు పొందిన భవనంలో కాకుండా, వేరే చోట ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలను నిర్వహించవద్దన్నారు. ఇంటర్మీడియట్‌లో చేరేటప్పుడు 10వ తరగతి ఒరిజినల్ మెమోలను కాలేజీల్లో ఉంచుకోకూడదని, వాటిని విద్యార్థులకు ఇచ్చేయాలన్నారు. నిబంధనలు పాటించని జూనియర్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జిల్లా అబ్జర్వర్‌గా దేవానంద్ రెడ్డి

విశాఖ విద్య: మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా అబ్జర్వర్‌గా డి.దేవానంద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లా ప్రాధాన్యం దృష్ట్యా దేవానంద్ రెడ్డికి జిల్లా బాధ్యతలు అప్పగించారు.

● అలలు పోయి.. శిలలు పైకి



ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం



సముద్రం వెనక్కి తగ్గడంతో రాళ్లు బయటపడ్డాయి. సముద్రం ముందుకొచ్చి తీర ప్రాంతాన్ని కోతకు గురిచేయడం ఇటీవల సర్వ సాధారణంగా మారింది. అయితే గురువారం సముద్రం ఒక్కసారిగా వెనక్కి వెళ్లడంతో సందర్శకులు ఆశ్చర్యానికి గురయ్యారు. వాతావరణంలో మార్పులు, సముద్రంలో ఆటుపోట్ల కారణంగా ఇలా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని కారణంగా ఆర్కే బీచ్ నుంచి వీఎంఆర్డీఏ పార్క్ వరకు సముద్రంలో రాళ్లు పైకి కనిపించాయి. పర్యాటకులు వాటిపైకెక్కి సెల్ఫీలు తీసుకున్నారు.

● ఉద్యోగ భద్రత కోసం ఆర్పీల ఆందోళన



ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని ఆర్పీలు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ తరఫున నివాళులర్పించారు. అనంతరం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చూడాలంటూ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. 8లో

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు..' కొద్ది నెలలుగా కేంద్ర మంత్రులు చెబుతున్న ఈ మాట చర్విత చరణంగా మారింది.
గురువారం వచ్చిన ఉక్కు శాఖ మంత్రి, సహాయ మంత్రి ప్లాంట్‌లో కూర్చొని ఇదే మాట మళ్లీ వల్లెవేశారు. ఓవైపు సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతున్నా.. దాని గురించి పట్టించుకోకుండా కేవలం నిధులిచ్చాం.. మాకు జేజేలు కొట్టాలనే విధంగా వ్యవహరించారు. దీనిపై కార్మిక, ఉద్యోగ సంఘాల్లో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. జీతాలపైన రాజకీయ హామీ ఇచ్చేసి చేతులు దులిపేసుకున్నారంటూ మండిపడుతున్నారు. మరోవైపు ఎమ్మెల్సీ కోడ్ ఉన్నా పట్టించుకోకుండా విద్యార్థులను ఎండలో నిలబెట్టి జేజేలు కొట్టించుకున్నారు.

● వచ్చారు.. వెళ్లారు.. పాత కబురే చెప్పారు

ఉక్కుపై అదే పాట

- ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదంటూ మరోసారి చెప్పిన కేంద్ర మంత్రి కుమారస్వామి
- సెయిల్‌లో విలీనంపై మాట దాటవేసిన మంత్రులు
- కేంద్ర ఉక్కు శాఖ మంత్రుల పర్యటనపై కార్మిక వర్గాల అసంతృప్తి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించి విద్యార్థులతో రోడ్‌షోలు నిర్వహించిన బీజేపీ
- అపాయింట్‌మెంట్ కోసం కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు ఎదురుచూపులు
- నిధులు విడుదల చేసినంత మాత్రాన ప్లాంట్‌కు ఒరిగిందేమీ లేదంటున్న సంఘాల నేతలు
- చివరి నిమిషంలో సెయిల్‌తో చర్చలు కూడా రద్దు చేసుకున్న మంత్రులు



ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తూ సాగిన మంత్రుల ర్యాలీ



మంత్రుల కాన్వాయ్ వెళ్తుండగా ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు, సంఘ నాయకులు

సాక్షి, విశాఖపట్నం/ఉక్కునగరం : వచ్చారు.. చూశారు.. అభివాదం చేశారు.. వెళ్లారు. ఇదీ క్లుప్తంగా కేంద్ర ఉక్కు మంత్రుల పర్యటన. గురువారం జరిగిన ఉక్కు శాఖ మంత్రుల స్టీల్‌ప్లాంట్ పర్యటనలో ఎలాంటి అద్భుతాలు చోటు చేసుకోలేదు. రెండేళ్ల నుంచి చెబుతున్న మాటే మరోసారి చెప్పి తప్పించుకున్నారు. ప్లాంట్ కోసం రూ.11,440 కోట్లు కేంద్రం విడుదల చేసిన తర్వాత తొలిసారిగా ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ విశాఖలో పర్యటించారు. గురువారం ఉదయం విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పలుచోట్ల ర్యాలీలు, పూలమాలలతో స్వాగతాలు పలికి.. స్టీల్‌ప్లాంట్‌కు చేరుకున్నారు. ప్లాంట్ ఎల్అండ్‌డీసీ ఆడిటోరియంలో అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్లాంట్ నడిపేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందిస్తామనేది చెప్పకుండా.. గతంలో చెప్పిన అంశాల్నే మంత్రి కుమారస్వామి పునరుద్ఘాటించారు. మొదటిసారి స్టీల్‌ప్లాంట్‌కి వచ్చినప్పుడు ప్రైవేటీకరణ లేదని కుమారస్వామి చెప్పారు. అనంతరం పార్లమెంట్‌లో ఎంపీ కీర్తిఆజాద్ అడిగిన ప్రశ్నకు ఆయనే ప్రైవేటీకరణ వ్యవహారం నడుస్తోందని చెప్పారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడికి వచ్చి.. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని చెప్పడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ప్రైవేటీకరణ జరగనప్పుడు ఈ నెల 8న విశాఖ వచ్చిన ప్రధాని మోదీ ఎందుకు దీనిపై స్పష్టత ఇవ్వలేదని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

సెయిల్‌తో సమావేశం రద్దు.!

విశాఖ చేరుకున్న తర్వాత సెయిల్ అధికారులతో కేంద్ర మంత్రులు సమావేశమవుతారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఇందుకోసం సెయిల్‌లోని బీటీఎస్‌వోలో ఏర్పాట్లు కూడా చేశారు. విమానం ఆలస్యమైందన్న నెపంతో సెయిల్‌తో చర్చలు చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. దీంతో ఉద్యోగ, కార్మిక సంఘాల ఆశలు అడియాశలయ్యాయి. ఈ సమావేశం తర్వాత సెయిల్‌లో విలీనంపై స్పష్టత వస్తుందని అంతా ఎదురు చూశారు. కానీ.. విమానం ఆలస్యం పేరుతో సమావేశం రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాంట్‌పైనా, ఉద్యోగులు, కార్మికులపై నిజంగా ప్రేమ ఉంటే ఆలస్యమైనా సమావేశం పూర్తి చేసి వెళ్లేవాళ్లంటూ ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలపైనా గాలి మాటలేనా.?

వివిధ ఉక్కు సంఘాల ప్రతినిధులు ఉదయం నుంచి మంత్రులతో మాట్లాడేందుకు పలుమార్లు ప్రయత్నించారు. కానీ సాయంత్రం స్టీల్‌ప్లాంట్ నుంచి ఎయిర్‌పోర్టుకు బయలుదేరే ముందు సంఘ నేతలను రావాలంటూ మంత్రులు పిలుపునిచ్చారు. వెళ్లగానే ఎలాంటి ఆందోళనలు చేయకుండా సంయమనం పాటిస్తే.. మంచిరోజులు వస్తాయంటూ ఉద్బోధ చేశారు. సెయిల్‌లో విలీనంపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పలుమార్లు మాట్లాడే ప్రయత్నం చేయగా.. మాట మార్చి వచ్చిన నిధులతో ప్లాంట్‌ను గాడిలో పెడదామని హితవుపలికారు. రెండు మూడు నెలల్లో పూర్తి వేతనాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని చెప్పేసి.. అక్కడి నుంచి పయనమయ్యారు. కార్మికుల మాట వినకుండానే పర్యటన ముగించేశారు. ఢిల్లీలో వేతనాలు గురించి అడిగినప్పుడు ప్యాకేజీ వచ్చిన వెంటనే పెండింగ్ జీతాలు మొత్తం చెల్లించేస్తామని.. అంతవరకూ ఎలాంటి ఆందోళనలు చెయ్యొద్దని చెప్పిన మంత్రి.. ఇక్కడికి వచ్చిన తర్వాత మాత్రం ఇంకో మూడు నెలలు ఆగాలని చెప్పడంపై మండిపడుతున్నారు.

నిరాశ కలిగించింది



కేంద్ర మంత్రి కుమారస్వామి పర్యటనపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎంతో ఆశపెట్టుకున్నారు. ఇప్పటికే 4 నెలలపాటు జీతం సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు మంత్రి పర్యటనతో జీతాలు వస్తాయని ఎదురు చూశారు. ఆయన కూడా మరో రెండు, మూడు నెలలు సమయం కావాలని కోరడం తీవ్ర నిరాశ కలిగించింది.

– మంత్రి రాజశేఖర్, పోరాట కమిటీ చైర్మన్

జీతాలపై వాయిదా అన్యాయం



స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ వల్ల ఉద్యోగులకు ప్రత్యక్షంగా మేలు జరగకపోయినా సంస్థకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఉద్యోగులు 4 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతుంటే మంత్రి మరో 2, 3 నెలలు అని చెప్పడం దురదృష్టకరం. మంత్రి మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి.

– కె.ఎస్.ఎన్. రావు, పోరాట కమిటీ కన్వీనర్

సొంత గనులపై హామీ లేదు



స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల అంశంపై ఎటువంటి హామీ లేదు. సొంత గనులు ఇస్తే ఏడాదికి రూ.3 వేల కోట్లు మిగులుతాయి. జీతాలు సక్రమంగా ఇవ్వరు.. రా మెటీరియల్ ఇవ్వరు. వీఆర్ఎస్ పేరిట ఉద్యోగులను తొలగిస్తారు. కానీ అధిక ఉత్పత్తి చేయాలంటున్నారు. ఇది ఎలా సాధ్యం. జీతాలు సక్రమంగా ఇచ్చి అధిక ఉత్పత్తి వైపు ఉద్యోగులను ప్రోత్సహించాలి.

– జె.అయోధ్యరామ్, ఉక్కు పోరాట కమిటీ కో–కన్వీనర్

కోడ్ ఉల్లంఘిస్తూ..



ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జెండాలు, ప్లకార్డులు, హోర్డింగులు

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. దీన్ని బీజేపీ నేతలు బేఖాతరు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వరకూ బీజేపీ, టీడీపీ, జనసేన జెండాలు, హోర్డింగ్‌లతో నింపేశారు. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్‌లోకి మంత్రుల కాన్వాయ్ రాగానే.. పాఠశాల విద్యార్థుల చేతికి ప్లకార్డులు ఇచ్చి.. ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తూ స్వాగతం పలికారు. అడుగడుగునా ఉల్లంఘనలు కనిపించినా అధికారులు చర్యలు తీసుకోవడం మానేసి పార్టీ నాయకులకు సహకరించడం గమనార్హం. మరోవైపు.. ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు మంత్రుల పర్యటనతో పెద్దగా ఒరిగిందేమీ లేదని విచారిస్తుండగా.. తమను లోపలికి పంపించలేదంటూ బీజేపీ శ్రేణులు పోలీసులతో వాగ్వాదం, స్టీల్‌ప్లాంట్ ఆవరణలో బైఠాయింపులు చేయడం విమర్శలకు దారితీసింది.



పాఠశాల విద్యార్థులతో మంత్రులకు స్వాగతం పలికించిన బీజేపీ శ్రేణులు

3 నుంచి నామినేషన్ల స్వీకరణ

- 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్, ఆర్వో హరేంధిరప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ చిత్రంలో డీసీపీ అజిత

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని విశాఖ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కలెక్టరేట్‌లో గురువారం డీసీపీ అజిత, డీఆర్వో, సహాయక రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉత్తరాంధ్ర పరిధిలోని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆర్వోలుగా, డీఆర్వోలు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

3 నుంచి నామినేషన్ల స్వీకరణ

షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కలెక్టర్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారని ఆర్వో హరేంధిరప్రసాద్ తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 3 గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలని, ఫారం–26 ద్వారా అఫిడవిట్ సమర్పించాలన్నారు. అనుమతుల జారీకి సంబంధించి కలెక్టరేట్‌లో సింగిల్ విండో డెస్క్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా అన్ని రకాల నిబంధనలు అభ్యర్థులకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

ఓటర్లు 21,555.. పోలింగ్ కేంద్రాలు 123

2024 డిసెంబర్ 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుష ఓటర్లు 12,948, మహిళా ఓటర్లు 8,607 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. విశాఖలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూరుస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. డీసీపీ అజిత మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

పర్యవేక్షణకు 23 బృందాలు : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 ఎంసీసీ బృందాలను నియమించామని కలెక్టర్ చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్, జెడ్పీ సీఈవో, భీమిలి, విశాఖ ఆర్డీవోలను నోడల్ అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలేవీ?



మాట్లాడుతున్న వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్

సీతంపేట: నీటి వనరులు, సముద్ర తీరప్రాంత కాలుష్యానికి కారణం అవుతున్న పరిశ్రమలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ ప్రశ్నించారు. విశాఖ జిల్లాలో హెటిరో, అచ్యుతాపురం సెజ్, రాంకీ, దివీస్ పరిశ్రమలు సముద్రంలోకి విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల ఏర్పడిన కాలుష్యం, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార గ్రామాలను సందర్శించి క్షేత్ర స్థాయి పరిస్థితిని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల కాలుష్యం వల్ల 2 లక్షల మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాయకరావుపేట, అనకాపల్లి, భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో ఉన్న సముద్ర తీర ప్రాంతాన్ని, నీటి వనరులను సందర్శించి అక్కడి కాలుష్య వాతావరణాన్ని పరిశీలించి, మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. తీరప్రాంతంలో ఉన్న పరిశ్రమల వల్ల వచ్చే వ్యర్థాలు సముద్రంలో కలిసి, మత్స్యసంపదకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. కాలుష్యం వల్లే తాబేళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు చేపట్టాలని గతంలోనే సూచించినా.. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆక్షేపించారు. లాసన్స్ బే కాలనీ వద్ద పెద్ద ఎత్తున మురుగునీరు డ్రెయిన్ ద్వారా సముద్రంలో కలుస్తోందని, ముడసర్లోవ డంపింగ్‌యార్డ్ నుంచి వస్తున్న మురుగు నీరు ముడసర్లోవ డ్యామ్‌లో కలుస్తోందని, ఈ విషయంలో జీవీఎంసీపై కోర్టులో కేసు వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పరిరక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజలు చైతన్యవంతులై నీటి వనరులు, సముద్రతీర ప్రాంత పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. మీడియా కూడా తీరప్రాంత పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, మత్స్యకార నాయకులు ఆదినారాయణ, బాబ్జి, డాక్టర్ కిరణ్, శంకు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఖైదీల తరలింపు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం నుంచి 200 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 28వ తేదీ నుంచి రోజుకు 20 మంది చొప్పున ఎస్కార్ట్ వ్యానులో తరలిస్తున్నారు. మూడోరోజు గురువారం కూడా 20 మందిని తరలించారు. ఇంతవరకు 60 మందిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు జైల్ అధికారులు తెలిపారు.

భావోద్వేగ నియంత్రణతో మానసిక స్థిరత్వం

సింధియా: ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి సమన్వయంతో విశాఖలోని నావికా సిబ్బందికి మానసిక స్థితిస్థాపకత, భావోద్వేగ మేధస్సుపై తూర్పు నావికాదళం గురువారం సదస్సు నిర్వహించింది. నేవీ సిబ్బందిలో ఒత్తిడి తగ్గించేందుకు, వారి భావోద్వేగ మేధస్సు బలపడేందుకు ఈ సెమినార్ ఎంతగానో ఉపయోగపడుతుందని నేవీ వర్గాలు తెలిపాయి. ఇకామ్ ఫౌండేషన్ నుంచి విచ్చేసిన కృష్ణాజీ ప్రసంగించారు.

హైదరాబాద్–కటక్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: హైదరాబాద్–కటక్–హైదరాబాద్ ప్రత్యేక రైలును మరికొంత కాలం పొడిగించారు. హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ మంగళవారం రాత్రి 8.10 గంటలకు బయల్దేరి బుధవారం ఉదయం 9.05 గంటలకు దువ్వాడకు, సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. మార్చి 25 వరకు పొడిగించారు. కటక్–హైదరాబాద్(07166) స్పెషల్ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 7.35కు దువ్వాడకు, రాత్రి 9కి హైదరాబాద్ చేరుకుంటుంది. మార్చి 26 వరకు పొడిగించారు.

పరిశోధకులకు భంగపాటు

ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల వేళ పరిశోధకులకు పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించవద్దని ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదమయ్యాయి. విశ్వవిద్యాలయం ప్రతిష్టను దిగజార్చేలా ఈ నిర్ణయం ఉందంటూ ఆచార్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీఆర్ హబ్‌లో పీహెచ్‌డీ చేస్తున్న వారిలో ప్రముఖులు సైతం ఉన్నారు. అర్హతలు లేని వారికి పీహెచ్‌డీలు నిలిపివేయవచ్చు. కానీ అర్హత కలిగిన వారికి పరీక్షలు నిర్వహించకుండా అడ్డుకోవడం సరికాదని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. – విశాఖ విద్య

- ఆంధ్రా యూనివర్సిటీలో వింతపోకడలు
- పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించవద్దంటూ ఆదేశాలు
- రీసెర్చ్ స్కాలర్స్‌కు అవార్డు ప్రకటించకుండా కొర్రీలు
- ప్రవేశాలు పొందిన అభ్యర్థులు 700
- ఇందులో పలువురు ప్రముఖులు
- వర్సిటీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



ఆంధ్రా యూనివర్సిటీ టీడీఆర్- హబ్ ఆధ్వర్యంలో ప్రవేశాలు పొందిన రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించవద్దని వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రీసెర్చ్ స్కాలర్స్‌కు ప్రీ పీహెచ్‌డీ/పీహెచ్‌డీ వైవా పరీక్ష నిర్వహించవద్దని వర్సిటీ అకడమిక్ విభాగాల అధిపతులకు సర్క్యులర్ పంపించారు. వర్సిటీ కాలేజీల విభాగాధిపతులకు ఈ ఉత్తర్వుల ప్రతులు అందడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. వర్సిటీ పెద్దలు తీసుకున్న ఇలాంటి నిర్ణయం పరిశోధకులను అవమానించినట్లేనని ఆచార్యులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రా యూనివర్సిటీలో పరిశోధనలకు పెద్ద పీట వేసే క్రమంలో ప్రసాద్‌రెడ్డి ఉపకులపతిగా ఉన్న సమయంలో ప్రత్యేకంగా టీడీఆర్-హబ్ ఏర్పాటు చేశారు. యూజీసీ నిబంధనలకు లోబడి, ఏపీఆర్ సెట్ ద్వారా అర్హత సాధించిన వారితో పాటు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి కూడా అర్హతల మేరకు వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫార్సుతో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు కల్పించారు. ఇలా చేరిన వారి నుంచి యూజీసీ నిర్ధారించిన ఫీజుతో పాటు, వర్సిటీకి ఆర్థికంగా లబ్ధి చేకూరేలా కొంత అదనంగా ఫీజు వసూలు చేశారు. ఇలా సుమారుగా 700 మందికి పైగా ప్రవేశాలు పొందగా, ఇందులో ప్రభుత్వ విభాగాల్లో పని చేసే ఉన్నతాధికారులు, వివిధ రంగాల్లో నిష్ణాతులు ఉన్నారు. వీరందరికీ పీహెచ్‌డీ అవార్డు ప్రకటించే క్రమంలో నిర్ణీత కాలవ్యవధిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది.

ఎందుకిలా?

ఆంధ్రా యూనివర్సిటీ టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా రీసెర్చ్ స్కాలర్ ప్రవేశాలు కల్పించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని వర్గాలు పనిగట్టుకొని ఫిర్యాదులు చేశాయి. దీంతో వర్సిటీ పాలనాధికారులు, టీడీఆర్ హబ్ పీహెచ్‌డీ ప్రవేశాలపై నిశిత పరిశీలన చేశారు. ఈ నేపథ్యంలో వర్సిటీ కాలేజీ విభాగాధిపతుల సమక్షంలో వీరికి ప్రీ పీహెచ్‌డీ/పీహెచ్‌డీ వైవా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకు సంబంధించి సర్క్యులర్ సైతం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ జరుగుతున్న తరుణంలోనే పరీక్షలు నిర్వహించవద్దని వర్సిటీ విభాగాధిపతులకు ఆదేశాలు అందడం తీవ్ర దుమారం రేపుతోంది. యూజీసీ నిబంధనల మేరకు వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదంతోనే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

శతాబ్ది ఉత్సవాల వేళ ఇదేం తీరు

టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులుగా చేరిన వారిలో అనేక మంది ప్రముఖులు ఉన్నారు. అర్హతలు లేని వారు ఎవరైనా ఉంటే, వారికి పీహెచ్‌డీ అవార్డు నిలుపుదల చేయవచ్చు. కానీ, యూజీసీ నిబంధనల మేరకు, అర్హతలు కలిగిన వారిని సైతం అవమానించేలా వర్సిటీ అధికారులు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. వర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు అంతా సిద్ధమవుతున్న తరుణంలో పాలనాధికారులు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరీక్షలు నిలుపుదల చేస్తున్నాం

టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో ప్రవేశాలు పొందిన రీసెర్చ్ స్కాలర్‌కు ప్రీ పీహెచ్‌డీ/పీహెచ్‌డీ వైవా పరీక్షలను నిర్వహించవద్దని విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేసిన మాట వాస్తవమే. ఉపకులపతి సూచనతోనే ఉత్తర్వులు జారీ చేశాం.

–కె.ఈశ్వర్‌కుమార్, అకడమిక్ ఎఫైర్స్ డీన్

‘పాలిటెక్’ ఓవరాల్ చాంప్ విశాఖ

- సత్తా చాటిన కృష్ణా, చిత్తూరు రీజియన్ జట్లు
- వ్యక్తిగత చాంప్స్ ఈశ్వర్, షణ్ముఖ ప్రియ
- ముగిసిన స్టేట్ అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్



బాలికల ఓవరాల్ చాంపియన్ భీమునిపట్నం బాలికల పాలిటెక్నిక్ కాలేజీ జట్టు



బాలుర ఓవరాల్ చాంపియన్ సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విశాఖ రీజియన్ జట్లు సత్తా చాటాయి. 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పోటీపడగా చిత్తూరు, కృష్ణా రీజియన్ జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌కు పోటీపడ్డాయి. బాలుర ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాయిగణపతి పాలిటెక్నిక్, గిడిజాల(విశాఖ రీజియన్), బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, భీమునిపట్నం(విశాఖ రీజియన్) జట్లు కైవసం చేసుకున్నాయి. వ్యక్తిగత బాలికల చాంపియన్‌షిప్‌ను ఇ.షణ్ముఖప్రియ, ప్రభుత్వ పాలిటెక్నిక్, చంద్రగిరి(చిత్తూర్ రీజియన్), వ్యక్తిగత బాలుర చాంపియన్‌షిప్‌ను ఎస్.ఈశ్వర్ వర్ధన్, సాయిగణపతి పాలిటెక్నిక్, గిడిజాల(విశాఖ రీజియన్) సాధించారు. స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను బాలికల్లో ఎ.ఎ.ఎన్.ఎం.వి.వి.ఎస్.ఆర్ పాలిటెక్నిక్, గుడ్లవల్లేరు(కృష్ణా రీజియన్), బాలురలో సాయిగణపతి పాలిటెక్నిక్, గిడిజాల(విశాఖ రీజియన్) జట్లు సాధించాయి. గేమ్స్ చాంపియన్‌షిప్‌ను బాలికల్లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, భీమునిపట్నం(విశాఖ రీజియన్), బాలురలో ఆర్యభట్ట పాలిటెక్నిక్, సబ్బవరం(విశాఖ రీజియన్) జట్లు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్(విశాఖ) కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు గురువారంతో ముగిశాయి. బహుమతి కార్యక్రమానికి వీపీటీ ప్రిన్సిపాల్, మీట్ కన్వీనర్ కె.నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములను స్వీకరిస్తూనే నేర్చుకోవాలని హితబోధ చేశారు. ఒలింపియన్ మాణిక్యాలు మాట్లాడుతూ ప్రతీ క్రీడాకారుడు దేశానికి ఒక మెడల్ సాధించి పెట్టాలని పిలుపునిచ్చారు. సాంకేతిక విద్యాశాఖ కాకినాడ ఆర్జేడీ జె.సత్యనారాయణ, తిరుపతి ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, మీట్ కో కన్వీనర్ బి.జానకిరామయ్య, జీపీసీఈ ప్రిన్సిపాల్ కేవీ రమణ పాల్గొన్నారు. పీడీలు అబ్బాస్, కమాల్, వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా సాంకేతిక విద్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

ఉత్కంఠ రేపిన వాలీబాల్ టైటిల్ పోరు

బాలుర వాలీబాల్ టైటిల్ పోరులో అప్పర్‌పూల్‌కు చెందిన జట్లే పోటీపడ్డాయి. లోయర్ పూల్ నుంచి సెమీస్‌లోనే వెనుదిరగ్గా ఫైనల్స్‌లో ఆర్యభట్ట పాలిటెక్నిక్, సబ్బవరం(విశాఖ రీజియన్)తో వీఎస్ఎం ఇంజినీరింగ్ (తూర్పుగోదావరి రీజియన్) జట్టు తలపడింది. చెరో సెట్ గెలవడంతో ఉత్కంఠరేపిన మ్యాచ్ డిసైడింగ్ సెట్‌లో విశాఖ రీజియన్ 15–10తో విజేతగా నిలిచింది.

ఫాస్టెస్ట్ రన్నర్స్ ఈశ్వర్, హరిణి

స్టేట్ అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఫాస్టెస్ రన్నర్స్‌గా బాలురలో ఈశ్వర్ వర్ధన్, బాలికల్లో డి.హరిణి నిలిచారు. 100 మీటర్ల బాలుర పరుగులో శివనాగసాయి, బి.రాము ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల్లో డి.వర్ష వెంకటదుర్గ, బి.బింధుశ్రీ ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బాలుర 200 మీటర్ల పరుగులో ఎస్.ఈశ్వర్ వర్ధన్, 400 మీటర్ల పరుగులో కె.శివలింగన్న, 800 మీటర్లు, 1,500 మీటర్ల పరుగుల్లో వై.మహేష్ విజేతగా నిలిచారు. బాలుర కబడ్డీలో ఆర్.కె.ఇంజినీరింగ్ కళాశాల(ఇబ్రహీంపట్నం) విజేతగా నిలవగా, గోకులకృష్ణా ఇంజినీరింగ్ కళాశాల(సూళ్లూరుపేట) రన్నరప్ సాధించింది. బాల్ బ్యాడ్మింటన్‌లో ఈఎస్‌జీ ప్రభుత్వ పాలిటెక్నిక్(నంద్యాల) విజేతగా, శ్రీ వై.వి.ఎస్.బి.ఆర్.ఎం.ఎం పాలిటెక్నిక్(ముక్తేశ్వరం) రన్నరప్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో వి.అజయ్‌కుమార్, కె.వి.సుబ్బారెడ్డి టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(కర్నూలు) విజేతగా, బి.జోయ్‌కుమార్, ఎస్‌టీఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(నరసరావుపేట) రన్నరప్‌గా నిలిచారు. బాలికల వాలీబాల్‌లో విశాఖ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్(విశాఖ) విజేతగా నిలవగా బాలాజీ పాలిటెక్నిక్(గజపతినగరం) రన్నరప్ సాధించింది. ఖోఖోలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్(భీమునిపట్నం) విజేతగా, శ్రీ పద్మావతి వుమెన్ పాలిటెక్నిక్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచాయి. 200మీటర్ల పరుగులో డి.హరిణి, 400, 800 మీటర్ల పరుగుల్లో రెండింటా ఈ.షణ్ముఖ ప్రియ విజేతగా నిలిచింది.

ఉద్యోగ భద్రత కోసం ఆర్పీల ఆందోళన



గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న మెప్మా ఆర్పీలు

సీతమ్మధార: ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని ఆర్పీలు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ తరఫున నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పి.మణి, మల్లీశ్వరి లత మాట్లాడుతూ ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, వ్యక్తిగత ఖాతాల్లో వేతనాలు వేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయని మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను జీవీఎంసీ పరిధిలో అమలు చేస్తామని పీడీ సత్యవేణి చెప్పారన్నారు. అయితే ఈ సర్క్యులర్ అమలు చేయడం లేదని, అటువంటి ఆలోచన తమకు లేదని ఏడీసీ రమణమూర్తి చెబుతున్నారని, ఈ రకంగా రెండు మాటలు మాట్లాడటం వల్ల తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్పీల సమస్యలపై నిర్దిష్టమైన చర్యలు చేపట్టి, 3 ఏళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చూడాలని రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆందోళనకు ఝాన్సీ, సత్య వరలక్ష్మి, లక్ష్మి, జయ, ఆదిలక్ష్మి, సన్యాసమ్మ, జ్యోతి రాణి, రత్నాలు, సన్యాసమ్మ, విశాలాక్షి, హిమబిందు తదితరులు నాయకత్వం వహించారు.

దాడి చేసి.. చోరీ కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార: దారి కాసి ఒక వ్యక్తిపై దాడి చేసి.. జేబులో ఉన్న నగదును చోరీ చేసిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెంకటరావు తెలిపారు. ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ రాత్రి సుమారు 10.28 గంటలకు ఫిర్యాదుదారుడైన విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన ఎం.శ్రవణ్ కుమార్ తన పని ముగించుకుని డైమండ్ పార్క్ దగ్గర గణేష్ బార్ సమీప ప్రాంతానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఆటోలో నలుగురు వ్యక్తులు వచ్చి శ్రవణ్‌పై దాడిచేసి, అతని జేబులో ఉన్న రూ.1000 నగదును దొంగిలించుకుపోయారు. దీంతో బాధితుడు ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ద్వారకా సబ్ డివిజన్ పోలీసు సీఐ పర్యవేక్షణలో ద్వారకా క్రైం ఎస్ఐ చక్రధర్, ఏఎస్ఐ కిశోర్, పీసీ రాజు, అప్పలరాజు, ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1000 నగదును, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో మారికవలసకు చెందిన లాగం అఖిల్ రామసాయి(18), తాటిచెట్లపాలేనికి చెందిన రొంగలి గణేష్(18), బోయపాలేనికి చెందిన వచ్చగొల్ల కేదార్ నాథ్(21), బాలుడు ఉన్నారు. సమావేశంలో ద్వారకా జోన్ క్రైం సీఐ చక్రధర్, క్రైం ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

చెరువు గర్భం పూడ్చివేయడంపై రైతుల ఆందోళన

ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్ని అడ్డుకున్న గ్రామస్తులు



రింగ్ రోడ్డు కోసం తవ్వేసిన చెరువు గర్భాన్ని పరిశీలిస్తున్న రైతులు

సబ్బవరం: విశాఖ -రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా చిన్నయ్యపాలెం వద్ద జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గ్రామాల రైతులు గురువారం అడ్డుకున్నారు. సుమారు 5 గ్రామాల రైతులకు సాగునీటిని అందించే చెరువును పూడ్చివేసి, రింగ్ రోడ్డు విస్తరణ చేపట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు కోటాన అప్పారావు, గొర్లి అచ్చెంనాయుడు తదితరులు మీడియాకు తెలిపిన వివరాలు. పెదనాయుడుపాలెం సమీపంలో సర్వే నెం.109లో 15.90 ఎకరాల్లో పెదనాయుడు చెరువు ఉంది. దీని కింద చిన్నయ్యపాలెం, ఆదిరెడ్డిపాలెం, గొర్లివానిపాలెం, తవ్వవానిపాలెం, పెదనాయుడుపాలెం రైతులకు చెందిన 90 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువును అనుకుని ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి రింగ్ రోడ్డు విస్తరణ జరుగుతోంది. గతంలో నిర్వహించిన సమావేశంలో చెరువు గర్భంలో సుమారు 2.30 ఎకరాలు రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరం అవుతుందని తేల్చారు. బదులుగా జిరాయితీ భూమి కొనుగోలు చేసి, చెరువు తవ్వి ఇస్తామని ఐదు గ్రామాల రైతులకు హామీ ఇచ్చారు. అలా చేస్తే తమకు అభ్యంతరం లేదని రైతులు అంగీకరిస్తూ అప్పట్లో స్థానిక ఇరిగేషన్ ఏఈ ద్వారా ఎస్ఈకి లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు. అయితే ఇరిగేషన్ చెరువుకు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం జరగదని అప్పటి ఎస్ఈ చెప్పారు. దీనిపై కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం హైవే అధికారులు కూడా ఈ విస్తరణ ప్రస్తావన తీసుకురాలేదని చెప్పారు. వివాదం కోర్టులో ఉండగా, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారం రోజులుగా పెదనాయుడు చెరువును పూడ్చి, చెరువును అనుకుని ట్రెంచ్ తవ్వుతున్నారని పేర్కొన్నారు. చెరువు గర్భం తగ్గిపోతే ఆయకట్టు నీటి సామర్థ్యం తగ్గి, పంటల సాగుకు నీరందక నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పనుల్ని నిలిపేయకుంటే జేసీబీతో తొలగిస్తామని హెచ్చరించారు. సైట్ ఇంజినీర్ రామకృష్ణ పీడీని ఫోన్‌లో సంప్రదించగా స్వయంగా వచ్చి రైతులతో మాట్లాడతానని చెప్పినట్లు రైతులు తెలిపారు. ఆందోళనలో రైతులు సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు నాగేంద్ర, బుజ్జి, శివ, గొర్లి శ్రీను, వెన్నల సన్నిబాబు, పంచాడ కొండలరావు, గోపాలకృష్ణ, ఐదు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

లౌకిక వాదానికి తూట్లు

- గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి
- మహాత్మాగాంధీ వర్ధంతిలో సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా



గాంధీ విగ్రహం వద్ద సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఆరోపించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీవీఎంసీ దరి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ అన్నీ తరాలవారికి ఆదర్శమని, అన్ని మతాల వారిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. గాంధీనీ చంపిన గాడ్సేకు నేడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు నివాళులర్పిస్తున్నారంటే లౌకిక వాదం, ప్రజాస్వామ్యం పట్ల వీరికి ఏమాత్రం గౌరవం ఉందో అర్థం చేసుకోవాలన్నారు. గాంధీ స్ఫూర్తితో ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారిమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనిరాజా, అమర్జిత్ కౌర్, బాలచందర్ కాంగో, పశ్య పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ఉదయం స్థానిక మంత్రిస్ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ప్రస్తుత దేశ రాజకీయాల పరిస్థితి, సీపీఐ నిర్వహించాల్సిన కర్తవ్యం తదితర అంశాలను వివరించారు.

నేవీ ఉద్యోగి అనుమానాస్పద మృతి



సంతోష్ మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డులో నేవీ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలివీ.. మల్కాపురం శ్రీహరిపురానికి చెందిన సిరిముళ్ల సంతోష్ (25) తన తండ్రి సూరిబాబు, తల్లి అచ్చియమ్మ, సోదరి దివ్యతో కలిసి నివసించేవాడు. సంతోష్ 2021లో డిప్లమో పూర్తి చేసిన తర్వాత ఉప్పాడ సమీపంలోని ఐఎన్ఎస్ కళింగలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)గా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి వాల్తేర్‌లోని తన పిన్ని ఇంటి వద్ద నుంచి ప్రతి రోజూ విధులకు హాజరవుతున్నాడు. వాల్తేర్ నుంచి కూడా దూరం కావడంతో.. నాలుగు నెలల కిందట కాపులుప్పాడ జగనన్న కాలనీలో తన స్నేహితుడు యశ్వంత్ సాయి, అతని సోదరితో కలిసి ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కాగా.. సంతోష్ విధులు ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన యశ్వంత్ సాయి ఉరి వేసుకున్న సంతోష్‌ను చూశాడు. వెంటనే అతను సంతోష్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. తన కుమారుడికి ఎటువంటి చెడు వ్యసనాలు లేవని, వచ్చే ఏడాది పెళ్లి కూడా చేసుకునేందుకు సిద్ధమయ్యాడని అతని తల్లిదండ్రులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు కూడా లేవని, అలాంటిది తమ కుమారుడు ఉరి వేసుకుని చనిపోవడమేంటని కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. యశ్వంత్ సాయికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహాత్ముని జీవితం ఆదర్శం



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మహారాణిపేట: మహాత్మా గాంధీ జీవిత చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి గురువారం కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి వైఎస్సార్ సీపీ నివాళి

మహారాణిపేట: జాతిపిత మహాత్మా గాంధీకి వైఎస్సార్ సీపీ నేతలు ఘన నివాళులర్పించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి ఆధ్వర్యంలో గాజువాక సమన్వయకర్త తిప్పల దేవాన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, బిపిన్ కుమార్, పి.వి.సురేష్, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు పేర్ల విజయ చంద్ర, జాన్ వెస్లీ, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు దొడ్డి కిరణ్, పేడాడ రమణి కుమారి, బోని శివరామ కృష్ణ, ఎస్.ప్రసాద్, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, ముఖ్యనేతలు ఎండీ షరీఫ్, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీ వత్సవ్, అల్లంపల్లి రాజబాబు, పీవీ నారాయణ, మారుతీ ప్రసాద్, రామన్నపాత్రుడు, గణేష్ గౌడ్, శ్రీదేవి వర్మ, మల్లేశ్వరి, దేవర కొండ మార్కండేయులు, అప్పన్న, రాము, సన్నీ, బొడ్డ గోవింద్, పిల్ల సూరిబాబు, కిల్లన రామ్ ప్రసాద్, బంగారు భవానీశంకర్, పులగమ శ్రీనివాస్‌రెడ్డి, పులగమ సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి గాంధీ

సీతమ్మధార: సత్యం, అహింస మార్గాల్లో దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహోన్నత వ్యక్తి జాతిపిత, మహాత్మాగాంధీ అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలో సెంట్రల్ పార్కు వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, జనసేన ఫ్లోర్ లీడర్ బీసెట్టి వసంతలక్ష్మి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్(యూసీడీ) సత్యవేణి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, జోనల్ కమిషనర్ ఫణిరామ్ పాల్గొన్నారు.

ఎముకల ఆరోగ్యంపై అవగాహన అవసరం

మహారాణిపేట: నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, ఆంధ్రా మెడికల్ కళాశాల, కేజీహెచ్ ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర స్థాయి సదస్సు (ఒసాప్కిన-2025) గురువారం ప్రారంభమైంది. తొలిరోజు గురువారం కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో కెడావరిక్ పెల్విస్ ఎసిటబిలర్ సర్జరీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్థోవైద్య నిపుణులు, పీజీ వైద్య విద్యార్థులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. సదస్సును ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, పలువురు వైద్యులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ ఎముకల విభాగానికి సంబంధించి నూతనంగా అందుబాటులోకి వస్తున్న వైద్యవిధానాలు, విప్లవాత్మకమైన మార్పులు, తదితర అంశాలపై పీజీ విద్యార్థులు, వైద్యులకు ఎంతో అవగాహన అవసరమన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్గనైజింగ్ చైర్మన్ పి.శివానంద మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా విశాఖలో కేజీహెచ్ అనాటమీ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించి విద్యార్థులకు ఎముకలు విరిగితే ఏ విధంగా వైద్యం అందించాలి అనే అంశంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ సర్జరీ నిర్వహణకు అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర కిశోర్ పూర్తిస్థాయి సహకారం అందించారన్నారు. వర్క్ షాపులో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎల్.ఎస్.లోకనాథ్, డాక్టర్ వర్మ, ప్రముఖ ఆర్థో వైద్యులు డాక్టర్ వి.వి.కె.తిర్కా, డాక్టర్ రమేష్‌సేన్, డాక్టర్ విజయ్, డాక్టర్ అశోక్, డాక్టర్ ప్రదీప్‌తోపాటు డాక్టర్ లీలా ప్రసాద్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జిగా డాక్టర్ భవానిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్ నాయుడు, కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గోశాల్లో ఆవులు చనిపోతే అనుమతులు రద్దు

కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరిక

మహారాణిపేట: గోశాల్లో ఆవులు చనిపోతే.. అనుమతి రద్దు చేస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో జీవహింస నివారణ చట్టం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూగ జీవుల పట్ల ప్రేమ కరుణతో వ్యవహరించాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గోశాల నిర్మాణానికి ఆనందపురం మండలం కుశలవాడలో ఐదు ఎకరాలు కేటాయించామని, ఇందులో ఒక షెడ్, రెండు నీటి తొట్టెల నిర్మాణం పూర్తయిందన్నారు. వీధి కుక్కల సంతతి నిరోధానికి 3 ప్రాంతాల్లో నలుగురు పశు వైద్యులతో రోజుకు 150 ఆపరేషన్ చేయడానికి కృషి చేస్తున్నామని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి కిశోర్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో కుక్కలను పట్టుకోవడంలో చాలా ఇబ్బందులు ఉన్నాయని డీపీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. తాబేలు సంరక్షణకు 112కు కాల్ చేయాలని అన్నారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉక్కు, పెట్రోకెమికల్ రంగాలపై సమీక్ష

విశాఖ సిటీ: నీతి ఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఉక్కు, పెట్రో కెమికల్ రంగాలపై గురువారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సమీక్ష జరిగింది. నీతి ఆయోగ్ సభ్యుడు కె.కిశోర్, మెట్రోపాలిటన్ కమిషనర్, నీతి ఆయోగ్ నోడల్ అధికారి కె.ఎస్.విశ్వనాథన్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ సస్టెనబిలిటీ ఎంప్లాయిమెంట్ అండ్ గ్రోత్(ఐఎస్ఈజీ) తరఫున శిరీష్ శాంభే సమావేశంలో పాల్గొని ఆయా రంగాలపై చర్చించారు.